సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 21 । జూన్ । 2023



కార్పొ'రేట్' పడిపోయింది..
జిల్లా కేంద్రంలో కార్పొరేట్ పోకడలు ఎక్కువై స్థానిక వ్యాపారం కుదేలవుతుండగా, వ్యాపారులు చేసిన పోరాటం ఫలించింది. 8లో



ఆలయాల్లో కొత్త కాంతులు
ధూప, దీప నైవేద్య పథకం అమలుతో అనేక దేవాలయాలు నేడు పునరుజ్జీవం పొందగా, నిత్య పూజలు జరుగుతున్నాయి. 10లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం
36° / 25°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి. వాతావరణం చల్లబడుతుంది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం



ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని జగన్నాధపురం – కేశవాపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కోర్టు సివిల్ జడ్జి జి.భానుమతి చిన్నారులకు పలకలు, బలపాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సీడీపీఓ కనకదుర్గ, ధర్మకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

23న ఒలింపిక్ రన్

కొత్తగూడెంటౌన్ : ఈనెల 23న కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నుంచి రైల్వే స్టేషన్ వరకు ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. రన్‌లో అన్ని క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెట్ల కిందే బాగుంది !



చెట్ల కింద కూర్చుని పనులు చేసుకుంటున్న పల్లె దవాఖానా సిబ్బంది

పాల్వంచరూరల్: ఎండవేడి కారణంగా ఉక్కపోత, తరచుగా విద్యుత్ కోతతో అవస్థ పడలేక పల్లె దవాఖానా సిబ్బంది సమీప చెట్ల నీడలో కూర్చుని పనులు చేసుకున్నారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని పల్లె దవాఖానాలో ఉల్వనూరు పీహెచ్‌సీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, స్థానికులకు పరీక్షలు చేశాక, రికార్డుల రాసే పని ఉండగా కార్యాలయంలో ఉక్కపోత భరించలేకపోయారు. దీంతో సమీపంలోని గ్రామపంచాయతీ భవనం ఎదుట చెట్ల నీడలో కింద కూర్చుని హాయిగా పని చేసుకుంటుండడం కనిపించింది.

ఇక సాయుధ రక్షణ



ఘర్షణ పడుతున్న అటవీ అధికారులు - పోడు సాగుదారులు(ఫైల్)

త్వరలో ఫారెస్టు పోలీస్ స్టేషన్లు

- బెండాలపాడు ఘటనతో అప్రమత్తమైన అటవీ శాఖ
- జిల్లాలో ఆరు స్టేషన్లకు ప్రతిపాదనలు
- నిర్వహణ బాధ్యత సివిల్ పోలీసులదే..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రైల్వేశాఖ తరహాలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు అటవీశాఖ సిద్ధమవుతోంది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 20 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని తాజాగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో రాష్ట్రంలోనే అడవులు ఎక్కువగా ఉన్న భద్రాద్రి జిల్లాపై అందరి దృష్టి పడింది.

పెరుగుతున్న పోడు పోరు

రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి జిల్లాలో 57 శాతం భూభాగం అడవులతో నిండి ఉంది. గత కొన్నేళ్లుగా స్థానికంగా పెరిగిన పోడు వ్యవసాయం, మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వలస వచ్చిన ఆదివాసీలు చేస్తున్న పోడు సాగుతో అడవుల సంరక్షణ కత్తిమీద సాములా మారింది. ముఖ్యంగా తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణ కోసం హరితహారం కార్యక్రమం చేపట్టింది. అప్పటి నుంచి ప్రతీ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు పోడు సాగుదారులు, అటవీ శాఖ సిబ్బంది మధ్య తరచూ ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. మొక్కలు నాటేందుకు ట్రెంచ్ కొట్టడం, గుంతలు తీసేందుకు అటవీ అధికారులు ప్రయత్నించినప్పుడల్లా స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇరు వర్గాల మధ్య తోపులాటలు, పెనుగులాటలు నిత్యకృత్యంగా మారాయి. పోలీసుల సాయం లేకుండా అటవీ భూముల్లోకి ఆ శాఖ సిబ్బంది అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది.

బెండాలపాడు ఘటనతో..

గతేడాది నవంబర్ 20న చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామపంచాయతీ పరిధిలో పోడు భూముల విషయంలో తలెత్తిన వివాదంలో అటవీ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావుపై వలస ఆదివాసీలు దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ఫారెస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయాలని 2022 నవంబర్ 27న రాష్ట్ర ప్రభుత్వానికి అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. తొలి దశలో 30 స్టేషన్లు ఏర్పాటు చేయాలని, ప్రతీ స్టేషన్‌లో 18 మంది వరకు సిబ్బంది ఉండాలని ఫారెస్టు అధికారులు కోరారు. గత కొంతకాలంగా ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. తాజాగా తొలి దశలో 20 వరకు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు.



రైల్వే తరహాలో

రైల్వే ఆస్తుల రక్షణకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఉన్నా రైల్వే ప్రాంగణాల దగ్గర జరిగే నేరాల అదుపు, విచారణకు ప్రత్యేకంగా ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్లు (జీఆర్‌పీ) ఉన్నాయి. ప్రభుత్వ పోలీసులే ఇక్కడ శాంతిభద్రతల విధులు నిర్వహిస్తారు. అయితే వీరి ఫోకస్ అంతా రైల్వే పరిధిలోనే ఉంటుంది. ఇదే విధంగా అడవుల రక్షణకు అటవీ సిబ్బంది ఉన్నా.. ఇక్కడ జరిగే నేరాలు, బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాల కోసం ప్రత్యేకంగా ఫారెస్టు పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయవచ్చని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా తొలి దశలో 20 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులో భద్రాద్రి జిల్లాకు ఆరు ఫారెస్టు పోలీస్ స్టేషన్లు కావాలని జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుండాల, ఆళ్లపల్లి, చంద్రుగొండ, దుమ్ముగూడెం, ములకలపల్లి, ఏడూళ్ల బయ్యారంలో ఏర్పాటు చేయాలని కోరారు. అయితే ఇందులో ఎన్ని స్టేషన్లకు అనుమతి లభిస్తుందో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

అప్పట్లో ఆయుధాలు..

పోడు సాగు సమస్య తీవ్రం కాకముందు అటవీ సిబ్బందికి స్మగ్లర్ల నుంచి సమస్యలు ఎదురయ్యేవి. అర్ధరాత్రులు, దట్టమైన అడవుల్లో గొడ్డళ్ల వంటి మారణాయుధాలు కలిగి ఉన్న స్మగ్లర్లను ఎదిరించడం అటవీ సిబ్బందికి కష్టంగా మారేది. దీంతో ఆ రోజుల్లో ఆత్మరక్షణ కోసం ఫారెస్టు సిబ్బందికి ఆయుధాలు అందించారు. అయితే నక్సల్స్ ప్రభావం పెరిగిన తర్వాత ఆయుధాల కోసం ఫారెస్ట్ శాఖ సిబ్బందిపై దాడులు చేయడంతో 80వ దశకం చివరలో అటవీ శాఖ నుంచి ఆయుధాలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. రాష్ట్ర విభజనకు ముందు అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలనే ప్రతిపాదనపై చర్చ జరిగినా చివరి నిమిషంలో ఉన్నతాధికారులు వెనక్కి తగ్గారు. అయితే గత కొంతకాలంగా పోడు పోరు పెరిగిపోవడం, బెండాలపాడులో ఎఫ్‌ఆర్‌ఓపైనే దాడి చేయడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అటవీ సిబ్బంది సమస్యపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఆయుధాలనే కాకుండా ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

విద్యారంగానికి పెద్దపీట



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో విప్ రేగా, కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా తదితరులు

- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు స్కూళ్లు
- విద్యాదినోత్సవంలో విప్ రేగా, కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మన ఊరు – మన బడి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యాదినోత్సవంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పేద విద్యార్థుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులను అభినందిస్తున్నామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, నోటు బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని, ప్రతి పాఠశాలలో పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. తర్వాత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో సీఎంఓ సైదులు, నాగరాజు, డీఐఈఓ సులోచనారాణి పాల్గొన్నారు.

హనుమాన్ బస్తీలో..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌బస్తీ జీపీఎస్‌లో మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో రక్త హీనత సమస్యను తగ్గించడానికి రాగి జావ అందిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, రాగిజావ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడిని ఇల్లులా కాపాడుకోండి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఇల్లెందు: ప్రతీ పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, జిల్లాలో 368 పాఠశాలలను మొదటి దశలో రీ మోడలింగ్ చేస్తున్నామని, అందంగా తయారైన పాఠశాలలను ఇల్లులా కాపాడుకోవాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. మండలంలోని సంజయ్‌నగర్ పాఠశాలలో మంగళవారం విద్యాదినోత్సవ వేడుకలను ఎమ్మెల్యే హరిప్రియతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే 80 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, 12 పాఠశాలలు కాంపోనెంట్‌గా మార్చామని చెప్పారు. ఫర్నిచర్, తాగునీరు, డైనింగ్ హాల్, గ్రీనరీ వంటి సామూహిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పాఠశాలల రక్షణ బాధ్యతను విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. ప్రభుత్వం 12 అంశాలపై పాఠశాలల రూపురేఖలను మారుస్తోందని, ప్రహరీ, టాయిలెట్స్, అదనపు గదులు, కిచెన్ షెడ్లు, రంగులు, ఇంగ్లిష్ మీడియంగా మార్చడం వంటి అనేక మార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనతో ప్రైవేట్ పాఠశాలలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని, సకల సదుపాయాలతో 1001 గురుకులాలు ఏర్పాటు చేసిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ ధాన్యం ప్రమోద్ కుమార్, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, మండల స్పెషల్ ఆఫీసర్ మరియన్న, పీఆర్ డీఈ రామకృష్ణ, ఏఈలు రాంబాబు, రాజు, సర్పంచ్ పాయం స్వాతి, ఉప సర్పంచ్ యాకుబ్‌బీ, హెచ్‌ఎం దమయంతి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష

కొత్తగూడెంఅర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించవద్దని, అలా చేసేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్.శిరీష హెచ్చరించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ ఆరోగ్య కేంద్రంలో 'సేవ్ ద గర్ల్ చైల్డ్' వాల్‌పోస్టర్లు అంటించాలని చెప్పారు. సమావేశంలో పాల్వంచ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య, డాక్టర్ అనూష, డాక్టర్ కోరా యాదవ్, డిప్యూటీ డెమో ఫయాజ్ మొహియుద్దీన్, నాగలక్ష్మి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ ప్రత్యేక సమావేశం

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈఓ విద్యాలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అధ్యక్షతన 22వ తేదీ ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సీఈఓ కోరారు.

ఇసుక మాఫియా ఆగడాలను వ్యతిరేకించండి

- అడ్డగోలు రవాణాతో రోడ్డు ప్రమాదాలు
- ప్రైవేట్ సెటిల్‌మెంట్లతో సరిపెడుతున్నారు
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ శాఖలు
- మావోయిస్టుల సంచలన ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి తీరం వెంబడి ఇసుక మాఫియా పేట్రేగిపోతోందని, ఆ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయారని మావోయిస్టులు సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ మణుగూరు, పాల్వంచ ఏరియా కమిటీ కార్యదర్శి సూర్యం పేరుతో మంగళవారం లేఖ విడుదలైంది. ఇసుక మాఫియాకు అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులను నిలదీయాలని, ఇసుక మాఫియా ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ లేఖలో మణుగూరు మండలం అనంతారం, కట్టుమల్లారం, కమలాపురం గ్రామాల పరిధిలో జరిగిన పలు ఘటనలను మావోయిస్టులు పేర్కొన్నారు.

ఇసుక ప్రమాదాలు – సెటిల్‌మెంట్లపై ఆరోపణలిలా..

- 2021లో కమలాపురం గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన రెండు గేదెలను ఇసుక ట్రాక్టర్లు ఢీ కొట్టాయి. ఈ ఘటనలో చనిపోయిన బర్రెలకు నష్ట పరిహారంగా రూ. 1.40 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఇసుక మాఫియా కేవలం రూ.40 వేలతో సరిపెట్టింది. ఇదే గ్రామానికి చెందిన మరో రైతుకు చెందిన గేదెను ఢీ కొట్టి కేవలం రూ.10 మాత్రమే పరిహారంగా ఇచ్చారు.
- గత మేలో ఇసుక లారీలు ఢీ కొట్టడంతో ఐదు పాడి గేదెలు చనిపోయాయి. ఈ ఘటనపై స్థానికులు తిరగబడటంతో ఐదింటికీ కలిపి రూ.2.30 లక్షలు మాత్రమే పరిహారంగా ఇచ్చారు. మరుసటి రోజు మరో రైతుకు చెందిన గేదెను ఢీ కొట్టి ప్రైవేటు సెటిల్‌మెంట్‌లో కేవలం రూ.30 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.
- ఇసుక ట్రాక్టర్లు, లారీల కారణంగా దుమ్ము రేగుతోంది. రోడ్లపై నీళ్లు చల్లాలని డిమాండ్ చేసిన వ్యక్తులపై ఇసుక మాఫియా దాడులకు పాల్పడుతోంది. ఇందులో ఒకరి చేతులు విరగ్గొట్టగా మరో వ్యక్తిని గుర్తు తెలియని వాహనంతో ఢీ కొట్టించి హతమార్చారు.
- ఇసుక వాహనాల కారణంగా పెంపుడు కుక్కలు, కోళ్లు నిత్యం చనిపోతున్నాయి. మనుషులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎంతోకొంత ఇచ్చి ఇసుక మాఫియా సెటిల్‌మెంట్ చేసుకుంటోంది.
- ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగిపోయింది. ఈ రెండు శాఖల పేరున మండలాలు, స్టేషన్ల వారీగా ఒక్కో ట్రాక్టర్‌పై రూ.5 వేల వంతున వసూలు చేసి లంచాలు ఇస్తున్నారు. దీంతో వీరు ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదు.

రామాలయంలో నేడు 'ఆధ్యాత్మిక' వేడుకలు

- ఉదయం నుంచి రాత్రి వరకు దశాబ్ది పండుగ
- ఆలయ ఈఓ రమాదేవి



మాట్లాడుతున్న ఆలయ ఈఓ రమాదేవి

భద్రాచలం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామాలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నేడు ఉదయం 5.30 గంటకు ప్రచార రథంతో నగర ప్రదక్షిణ, 8 గంటలకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అనంతరం వేద పారాయణం, ఉత్సవ మూర్తులకు సువర్ణ పుష్పార్చన, 9 గంటలకు మూలమూర్తుల వద్ద రాష్ట్ర సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు ఉంటాయని వివరించారు. నిత్యకల్యాణం అనంతరం యాగశాల వద్ద సుదర్శన హోమం, దాతలకు సత్కారం ఉంటాయని వెల్లడించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయంలో కోలాటం, ఆంజనేయస్వామి ఆలయం వద్ద నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకు విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి 8 గంటలకు దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు ప్రత్యేక ప్రసాదాల వితరణ ఉంటుందని చెప్పారు. వైకుంఠ ద్వారం వద్ద సాయంత్రం 6 గంటల నుంచి దీపారాధన, శ్రీరామాయణం, శ్రీ కృష్ణలీలలు, శ్రీరామదాసు, లవకుశ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, శ్రీరామదాసు కీర్తనల గాత్ర కచేరీలు, 7 గంటలకు స్థానాచార్యులు స్థలశాయిచే క్షేత్ర చరిత్ర ప్రవచనం తదితర కారక్రమాలు ఉంటాయని వివరించారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భూములను న్యాయపరంగానే కాపాడుకుంటాం

ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న రామయ్య భూములను అప్పగించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటున్నామని ఈఓ తెలిపారు. అయినా కొందరు గ్రామస్తులు తమ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, తాము ధైర్యంగా పోలీసు, రెవెన్యూ శాఖల సహకారంతో వాటిని తొలగిస్తున్నామని తెలిపారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6వేల దేవాలయాల భూములను రక్షించుకున్నామని, రామయ్య భూములనూ రక్షించుకుని బోర్డులు పెట్టి భక్తులకు వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్, స్థానాచార్యులు స్థలశాయి, పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

బంధుమిత్రుల ఔదార్యం



అంజిరెడ్డి తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న బంధుమిత్రులు

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొడ్డు రామాంజిరెడ్డి గత నెల 11వ తేదీన తాటిచెట్టు పైనుంచి ప్రమాద వశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వెన్నెముక దెబ్బతినటంతో శస్త్ర చికిత్స చేశారు. అందుకోసం రూ.8 లక్షలకు ఖర్చవడంతో అప్పులపాలయ్యారు. అంజిరెడ్డి ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యాడు. ఆ కుటుంబ పరిస్థితులు తెలిసిన బంధుమిత్రులు 'ఫండ్ రైసింగ్ ఫర్ అంజిరెడ్డి' పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి, బంధుమిత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులను చేర్చారు. మంగళవారం వరకు రూ.5.08 లక్షలు పోగయ్యాయి. మంగళవారం బంధుమిత్రులంతా అంజిరెడ్డి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు ఆ మొత్తాన్ని అందించారు. రానున్న రోజుల్లో కూడా అంజిరెడ్డికి, కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని అంజిరెడ్డి మిత్రబృందం తెలిపింది.

డీపీఆర్‌ఓ కుటుంబ సభ్యులకు పరామర్శ



డీపీఆర్‌ఓ శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఎంవీ రెడ్డి దంపతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మంగళవారం రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ ఎంవీ రెడ్డి దంపతులు పరామర్శించారు. ఈ నెల 14న డీపీఆర్‌ఓ మాతృమూర్తి శీలం సరస్వతి మరణించింది. మంగళవారం కల్లూరులోని అంబేడ్కర్ నగర్‌కు వెళ్లి వారు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ ఎంవీ రెడ్డి విధులు నిర్వర్తించినప్పుడు శ్రీనివాస్ డీపీఆర్‌ఓగా పనిచేశారు.

ఎఫ్‌ఆర్‌ఓ కాంస్య విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

సెంట్రల్ పార్కుకు చలమల పేరు



చలమల శ్రీనివాసరావు మెమోరియల్ పార్క్‌గా ఏర్పాటు చేసిన బోర్డు

చుంచుపల్లి: చంద్రుగొండ మండలం బెండాలపాడులో గతేడాది నవంబర్ 22న గొత్తికోయల చేతిలో హత్యకు గురైన ఎఫ్‌ఆర్‌ఓ చలమల శ్రీనివాసరావు కాంస్య విగ్రహాన్ని కొత్తగూడెం సెంట్రల్ పార్క్‌లో ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, హరితోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పార్క్‌కు చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్కుగా ప్రభుత్వ విప్ రేగా కాంతారావు నామకరణం చేసి నామఫలకాన్ని ఆవిష్కరించారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో మోటార్ సైకిల్, కారు

బూర్గంపాడు: సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ ఏరియాలోని ఎస్‌బీఐ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఎస్‌బీఐ నుంచి బయటకు వస్తున్న మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్ నడుపుతున్న యువకుడితోపాటు వెనుక కూర్చున్న యువతికీ గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

పాల్వంచ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తగూడెంనకు చెందిన ఫైజల్ (26), వీరు కలిసి మోటార్ సైకిల్‌పై కిన్నెరసాని వైపు వెళ్తున్నారు. కరకవాగు వద్ద ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలవగా వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొత్తగూడెంనకు చెందిన ఫైజల్ మృతి చెందాడు. వీరును మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు సమాచారం.

కార్పొ 'రేట్' పడిపోయింది..

- ఫలించిన స్థానిక వ్యాపారుల పోరాటం
- 'మన ఊరు – మన దుకాణం' పేరుతో ఉద్యమం
- 75 శాతం పెరిగిన విక్రయాలు



కొత్తగూడెంలోని ఓ వస్త్రదుకాణంలోకి కొనుగోలు చేసేందుకు వెళ్తున్న ప్రజలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలో కార్పొరేట్ పోకడలు, వ్యాపారాలు ఎక్కువై స్థానిక వ్యాపారం కుదేలవుతున్న నేపథ్యంలో వ్యాపారులంతా కలిసి శాంతియుతంగా 'మన ఊరు – మన దుకాణం' పేరిట చేసిన పోరాటం ఫలించింది. కొంతకాలంగా వినియోగదారులు తిరిగి స్థానిక దుకాణాల్లోనే కొనుగోళ్లు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. అయితే, శాంతియుత ఉద్యమానికి శుక్రవారంతో 200 రోజులు పూర్తయింది. దశాబ్దాలుగా వ్యాపారాన్ని నమ్ముకొని జీవిస్తున్న వ్యాపారులు, ఒక్కసారిగా మార్కెట్‌లోకి ప్రవేశించిన కార్పొరేట్ కారణంగా వ్యాపారాలు మూసివేసే పరిస్థితి వచ్చింది. వస్త్రాలు, ఫాస్ట్‌ఫుడ్, ఎలక్ట్రికల్, హోటల్, బంగారం దుకాణాలు.. ఇలా అన్ని రంగాల్లో కార్పొరేట్ వ్యవస్థ దూసుకురావడం, ప్రజలు కూడా వాటిని ఆదరించడంతో స్థానిక వ్యాపారాలు కుదేలయ్యాయి. ఈ క్రమంలో పాతతరం నుంచి వ్యాపారం చేస్తున్నవారు తమ వ్యాపారాలను నిలబెట్టుకునేందుకు ఉద్యమం చేపట్టి వినియోగదారుల ఆదరణ పొందేందుకు చేసిన పోరాటం ఫలించింది. దశాబ్దాలుగా వ్యాపారం చేస్తున్న వారి వద్దనే వస్త్రాలు నాణ్యతంగా ఉన్నాయని గమనించిన వినియోగదారులు తిరిగి తమ వద్దకే వస్తున్నారని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కంటే ప్రస్తుతం వ్యాపారాలు మెరుగుపడ్డాయంటున్నారు. శాంతియుతంగా రోజుకో స్లోగన్‌తో సోషల్ మీడియాతోపాటు ప్రతి షాపులో ఏర్పాటు చేసిన ప్లకార్డుల కారణంగా మార్పు వచ్చిందంటున్నారు. సింగరేణి యాజమాన్యం నిత్యావసరాల వ్యాపారాలు పెట్టుకోవాలని 1942లో ఇల్లెందు (బొగ్గుట్ట)లోని స్థానికులను కోరగా కొందరు కొత్తగూడెం వచ్చి వ్యాపారం చేయడం ప్రారంభించారు. అలా వ్యాపారాలకు అప్పటి సింగరేణి యాజమాన్యం ఊపిరిపోసింది. అనంతర కాలంలో కొత్తగూడెంలో అన్ని రకాల వస్తువులు, దుస్తులు వినియోగదారులకు, ప్రజలకు, ఉద్యోగులకు, కార్మికులకు అందుబాటులో వచ్చాయి.

200వ రోజుకు చేరిన పోరాటం

దశాబ్దాలుగా వ్యాపారం సాగిస్తున్న తమ వద్దనే వినియోగదారులు కొనుగోళ్లు చేయాలని కొత్తగూడెంలోని 110 మందికిపైగా వ్యాపారులు కలిసి చేస్తున్న శాంతియుత పోరాటం శుక్రవారానికి 200వ రోజుకు చేరుకుంది. వ్యాపారులంతా తొలి రోజుల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలు స్థానిక వ్యాపారులను ఆదరించే విధంగా చేసేందుకు కార్యాచరణ రూపొందించి అమలుచేశారు. అప్పటి నుంచి 200 రోజులుగా రోజుకో స్లోగన్ రూపొందించి ప్రతి రోజూ వాట్సాప్‌లలో పంపించారు. అలా ప్రజలందరికీ మన ఊరు – మన దుకాణంపై అవగాహన కల్పించారు. ఈ స్లోగన్లకు సంబంధించిన ప్లకార్డులను దాదాపు కొత్తగూడెంలోని 800కిపైగా దుకాణాల్లో ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు రూపొందిస్తున్న స్లోగన్లను దాదాపు 5 వేల మందికి పైగా స్థానికులకు వాట్సాప్‌లలో పంపించారు. నాణ్యమైన వస్త్రాలు, వస్తువులు, బంగారం స్థానిక దుకాణాల్లోనే దొరుకుతాయనే నమ్మకాన్ని వినియోగదారులకు కలిగించారు. దీంతో వినియోగదారులు మళ్లీ పాత తరం దుకాణాలకే వస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం 75 శాతం వరకు వ్యాపారం పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆదరణ పెరుగుతోంది.



కొత్తగూడెం జిల్లా కేంద్రంలో స్థానిక వ్యాపారాలను ఆదరించాలని కోరుతూ చేపట్టిన శాంతియుత పోరాటం 200 రోజులకు చేరింది. ఈ పోరాటంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వినియోగదారులు నాణ్యతను పసిగట్టి మళ్లీ పాత దుకాణాలకే వస్తున్నారు. దీంతో వ్యాపారాలు మళ్లీ గాడిలో పడ్డాయి.

– మొరిశెట్టి భవానీప్రసాద్, 'మన ఊరు – మన దుకాణం' రూపకర్త

ఐక్యంగా పోరాటం చేశాం..



కొత్తగూడెంలోని వ్యాపారులంతా కలిసి ఐక్యంగా పోరాటం చేసినందున మంచి ఫలితాలు వస్తున్నాయి. కార్పొరేట్ పోకడలు అప్పటివరకే అని, స్థానిక వ్యాపారుల వద్ద కొనుగోలు చేసిన వస్తువులు ఎప్పటికీ నిలిచి ఉంటాయని ప్రజలు గుర్తించారు. వినియోగదారులు కూడా రెండింటి మధ్య తేడాలను గమనించారు.

– పల్లపోతు శ్రీనివాస్, వర్తక సంఘం సభ్యుడు

ప్యాకేజ్ కోసం అడవి డ్యామేజ్..!

- నిర్వాసితుల జాబితాలో చోటు కోసం యత్నాలు
- అటవీశాఖ అండదండలతోనే తతంగం!



అడవిలో నేలకూలిన చెట్లు

ఇల్లెందురూరల్: సింగరేణి జేకేసీ నిర్వాసిత జాబితాలో చోటు కోసం నేటికీ పలువురి ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. అర్హుల పేర్లు తొలగించి భూమితో సంబంధం లేనివారి పేర్లు జాబితాలోకి చేరుతున్నట్లు పలు ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో మరింతమందికి ఆ అవకాశం ఇచ్చేందుకు అటవీశాఖ అధికారులే నిర్వాసిత ప్రాంతానికి ఆనుకొని ఉన్న అడవిని నరికేందుకు ప్రోత్సహించారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మండలంలోని సీఎస్పీబస్తీ, తిలక్‌నగర్ గ్రామ పంచాయతీల నడుమ ఉన్న అటవీప్రాంతంలో సెంచరీ ఇంక్లైయిన్ భూగర్భ గని సమీపంలో మంగళవారం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు నిర్వాసిత ప్రాంతంలోని జామాయిల్ తోట పక్కనే సుమారు ఎకరం విస్తీర్ణంలో విచక్షణారహితంగా చెట్లను నరికివేశారు. నరికిన చెట్లను కాలిబాటకు అడ్డుగా వేసి తాము నిర్దేశించుకున్న విధంగా నిర్వాసిత ప్రాంతానికి సమాంతరంగా చెట్లు నేలకూల్చారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ రేంజర్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అటవీశాఖ డీఆర్‌ఓ సాల్మన్‌రాజ్, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని నరికివేసిన చెట్లను పరిశీలించారు. నిర్వాసిత ప్రాంత సరిహద్దుకు సమాంతరంగా చెట్లు నరికివేసినట్లు నిర్ధారించారు. సోమవారం కొందరు అధికారుల సహకారంతో ప్యాకేజీ రాబట్టుకునేందుకు యంత్రాలతో నేలను చదును చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. ఆ ప్రాంతాన్ని కూడా అటవీశాఖ అధికారులు పరిశీలించి నిర్ధారించారు. ఇదే విషయమై అటవీశాఖ రేంజ్ అధికారి నాగేశ్వరరావును వివరణ కోరగా.. ప్యాకేజీ కోసమే కొందరు అడవిని నరికినట్లుగా అనుమానాలు ఉన్నాయని చెప్పారు. సుమారుగా ఎకరం విస్తీర్ణంలో చెట్లను నేలకూల్చినట్లుగా అటవీశాఖ సిబ్బంది విచారణలో తేలిందని వివరించారు. ఈ వ్యవహారంలో అటవీశాఖ సిబ్బందిలో కొందరి హస్తం ఉన్నదనే విషయంలో తమకు ఫిర్యాదులు ఉన్నాయని, శాఖాపరమైన విచారణ ప్రారంభించామని చెప్పారు.

శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బాలికలకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఈఓ

దేవస్థానం ఆధ్వర్యంలో 'ఉచిత పుస్తకాల పంపిణీ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

దశాబ్ది వేడుకలు..

దేవస్థానం ఆధ్వర్యంలో 'తెలంగాణ దశాబ్ది అవతరణ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం రంగనాయకుల గుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బాలబాలికలకు ఆలయ ఈఓ రమాదేవి నోట్ పుస్తకాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలను ఆలయంతో పాటు వైకుంఠ ద్వారం వద్ద నిర్వహించనున్నారు.

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన ఆటో

ఎనిమిది మందికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి ఆటో ఢీ కొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం గంపలగూడేనికి చెందిన ఎనిమిది మంది యువకులు కలిసి ఆటోలో సోమవారం అశ్వారావుపేట మండలంలోని గోగులపూడి అటవీ ప్రాంతంలోగల శ్రీ గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లారు. ఆలయం సందర్శించి తిరుగుపయనమయ్యారు. కాగా, అశ్వారావుపేట సమీపంలోని పట్టు పరిశ్రమ సమీపంలో మూలమలుపు వద్ద కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వ్యాన్ టైరు పంక్చర్ కావడంతో ఆగి ఉంది. ఈ వ్యాన్‌ను వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న గంపలగూడేనికి చెందిన గౌరిరాజు విజయ్‌కుమార్, చిట్టిమళ్ల తిరుపతిరావు, సాయికిరణ్, బాడిస వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, చట్టిపర్తి నాగరాజు, అరవింద్, పర్సా మణికంఠ, ఎం.వెంకటేశ్వరరావు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరువూరు ఆస్పత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో వ్యాన్, ఆటో

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం జూలూరుపాడు గ్రామ సమీపంలోని శ్రీకోటమైసమ్మతల్లి ఆలయం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కోటమైసమ్మతల్లి ఆలయం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. పాపకొల్లు గ్రామానికి చెందిన వాంకుడోతు రమేశ్, అన్నారుపాడుకు చెందిన తేజావత్ శ్రీకాంత్, మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఫ్యాన్సీ షాపులో చోరీ

ఇల్లెందు: పట్టణంలోని పటేల్‌చౌక్ ఏరియాలోని మజీషా ఫ్యాన్సీ, జనరల్ షాపులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి సుమారు రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారు. దుకాణం బంద్ చేసే సమయంలో సీసీ కెమెరాలను ఆఫ్ చేయడంతో నిందితులను గుర్తించడం క్లిష్టంగా మారింది. సీసీ కెమెరాలు ఆఫ్ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షాపు యజమాని గణేశ్‌గోయల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

మల్లెలమడుగులో విషజ్వరాలు

మూడు రోజుల్లో ఇద్దరు మృతి

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో కొద్దిరోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. మూడు రోజుల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గ్రామానికి చెందిన చల్లా వెంకటరమణ (40) జ్వరంతో నాలుగు రోజులుగా బాధపడుతూ మంగళవారం కొత్తగూడెం ఆస్పత్రిలో మృతి చెందాడు. మూడు రోజుల కిందట ఎస్సీకాలనీకి చెందిన నూనె నరసింహ (24) జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో రోజురోజుకూ జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుండటం మూడు రోజుల్లో ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తులు పలువురు జ్వరాలతో భద్రాచలం, కొత్తగూడెం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొందరు ఇంటి వద్దే ఆర్‌ఎంపీలతో వైద్యం చేయించుకుంటున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టాలని, గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన బాకీ సుధీర్ (40) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు కూతుర్లున్నారు. ఎస్ఐ ప్రవీణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆచూకీ తెలిస్తే చెప్పండి



వృద్ధుడి మృతదేహం

కొత్తగూడెంటౌన్: అనారోగ్యంతో మరణించిన వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ఒక ప్రకటనలో సూచించారు. ఓ వృద్ధుడు అనారోగ్యం బారిన పడినట్లు తెలియగా జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించే క్రమంలో 16వ తేదీన మృతి చెందాడని తెలిపారు. ఆయన పేరు గుమ్మడి రాజయ్య అని తెలుస్తుండగా, ఆచూకీ తెలిసిన వారు 87126 82017కు సమాచారం ఇవ్వాలని సీఐ పేర్కొన్నారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

భద్రాచలంఅర్బన్: భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ముదిరాజ్‌బజార్‌కు చెందిన షబానా బూర్గంపాడులోని మైనారిటీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమె భర్త కరీంపాషా ఏడేళ్లుగా ఎలాంటి ఉద్యోగం చేయకుండా, గంజాయి, మద్యానికి బానిసై, డబ్బుల కోసం నిత్యం భార్యతోపాటు ఇతర కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. దీంతో షబానా పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

వణికించిన గాలి, వాన

కూలిన ఇళ్లు.. పిడుగుపాటుకు పక్షుల మృతి



కోయగూడెంలో తాటి చెట్టుపై పిడుగుపడి కాలిపోతున్న దృశ్యం



పిడుగుపాటుకి మృతిచెందిన నల్లకొంగలు

టేకులపల్లి: మండలంలో మంగళవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కోయగూడెంలో పూనెం బుచ్చ ఇంటి వద్ద ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడటంతో కాలిపోయింది. అదే సమయంలో చెట్టుపై ఉన్న నాలుగు నల్లకొంగలు మృతి చెందాయి. సులానగర్‌లో మల్టీ పర్పస్ వర్కర్ శివ ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. కాలనీతండాలో ధరావత్ బాలు, చందులకు చెందిన ఇంటి పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. శాంతినగర్‌లో ప్రధాన రహదారిపై వృక్షం విరిగిపడింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానిక యువకులు చెట్టును తొలగించారు. మండలంలో పలు గ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై, తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచింది. విద్యుత్ శాఖ సిబ్బంది వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పడిపోయిన స్తంభాలను గుర్తించి చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గుండాలలో..

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు భారీ వర్షంతో ఉపశమనం పొందారు. కాగా, ఈ భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో సాగు పనులు ఆలస్యమయ్యాయి. తాజా వర్షంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆనందాపురం, అమెర్ద గ్రామాల్లో తాటి చెట్లపై పిడుగులు పడి మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా రాకపోవడంతో స్థానికులు మంటలు ఆర్పివేశారు. పిడుగుల వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విప్, సర్పంచ్ మధ్య వాగ్వాదం

కరకగూడెం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని భట్టుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన విద్యా దినోత్సవంలో విప్ రేగా కాంతారావు, సర్పంచ్ తోలెం నర్సింహారావు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. వేడుకకు హాజరైన గ్రామస్తులు తాగునీటి సమస్య పరిష్కరించాలని విప్‌ను కోరారు. ఈ క్రమంలో సర్పంచ్ కలుగజేసుకుని ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని, ఇందువల్లే పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. దీంతో పంచాయతీల అవసరాలకు తగ్గట్టు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లడం ఏంటని విప్ రేగా కాంతారావు సర్పంచ్‌ను ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఏడూళ్ల బయ్యారం సీఐ రాజగోపాల్ కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కానిస్టేబుల్‌ను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి మావోయిస్టులు ఒక అసిస్టెంట్ కానిస్టేబుల్‌ను దారుణంగా హతమార్చారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్‌లో అసిస్టెంట్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సంజయ్‌కుమార్ వెడ్జ ఈనెల 11న సెలవు పెట్టి 18 వరకు జిల్లా కేంద్రంలోనే ఉన్నాడు. ఆ తర్వాత సోమవారం స్వగ్రామమైన కుట్రు పోలీస్ స్టేషన్ పరిధి పాత కుట్ర గ్రామానికి వెళ్లాడు. దీంతో సోమవారం అర్ధరాత్రి ఆయన ఇంటికి వచ్చిన మావోయిస్టులు... నిద్రిస్తున్న సంజయ్‌కుమార్‌ను బయటకు తీసుకొచ్చి కత్తులు, గొడ్డళ్లతో దారుణంగా నరికి చంపారు. సమాచారం అందుకున్న కుట్రు పోలీసులు మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని బీజాపూర్‌కు తరలించారు.

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే

'మార్గదర్శి'పై దర్యాప్తు

ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, హైదరాబాద్ : మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఖాతాదారుల హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత కోసమే ఆ సంస్థలో అక్రమాలను వెలుగులోకి తెస్తున్నామని, అది తమ బాధ్యత అని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లిస్తుండటంతో ఖాతాదారులకు నష్టం కలగకుండా ఇప్పటికే రూ.1,035 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులను అటాచ్ చేసినట్టు తెలిపారు. మార్గదర్శి కంపెనీ ఏ కారణంగానైనా మూతపడితే ఖాతాదారులకు డబ్బులు ఇవ్వాల్సిన బాధ్యత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీపై ఉంటుందని తెలిపారు. మార్గదర్శి సంస్థ ప్రతి చట్టాన్ని, నిబంధనను అతిక్రమించిందని, ఇంకా అతిక్రమిస్తూనే ఉందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 9 బ్రాంచ్‌లలో 23 గ్రూప్ చిట్స్‌ను, వాటికి సంబంధించి రూ.604 కోట్ల టర్నోవర్ నిలిపివేసినట్టు చెప్పారు. ఇదే తరహాలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని ఇతర బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలపై ఆధారాలు లభిస్తే.. వాటిలోని చిట్ గ్రూప్‌ల టర్నోవర్ నిలిచిపోతుందని చెప్పారు. చివరకు మార్గదర్శి పడిపోతుందన్నారు.

సంజయ్ మంగళవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మూడేళ్ల లావాదేవీలను పూర్తిగా పరిశీలించి, అక్రమాలపై ఆధారాలు సేకరించామన్నారు. ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 108 బ్రాంచ్‌లలో కార్యకలాపాలపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర ఏజెన్సీలకు కూడా ఈ అక్రమాల సమాచారం ఇచ్చామని, తెలంగాణ, ఇతర రాష్ట్రాల డీజీపీలకు సమాచారం ఇస్తున్నామన్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఫిర్యాదు మేరకే ఏపీ సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోందని తెలిపారు. పూర్తి నిబంధనలు పాటిస్తూనే ఈ కేసులో ఏ-1 రామోజీరావును, ఏ-2 శైలజాకిరణ్‌ను ప్రశ్నించామన్నారు.

ఖాతాదారులను మభ్యపెడుతున్నారు

మార్గదర్శి అక్రమాలపై ఖాతాదారుల నుంచి ఫిర్యాదు లేకుండానే కేసు దర్యాప్తు చేస్తున్నారంటూ ఒక సెక్షన్ మీడియా ఆరోపణలు చేస్తోందని, అయితే ఖాతాదారులకు వడ్డీని ఆశజూపి ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లిస్తుండటాన్ని తాము వెలుగులోకి తెస్తున్నామని చెప్పారు. ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేసేకంటే ముందే తాము వారి సొమ్ము కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఏ బాధితుడి విషయంలో అయినా ఇదే పద్ధతి అని స్పష్టం చేశారు. చాక్లెట్ ఇచ్చి బాలికను కిడ్నాప్ చేస్తే.. సమాచారం అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు కానీ, బాధితురాలు ఫిర్యాదు ఇచ్చేవరకు కూర్చోరని.. అదే తరహాలో లక్షల మంది ఖాతాదారుల సొమ్మును కాపాడేందుకు మార్గదర్శిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు న్యాయం చేస్తుంటే మార్గదర్శిపై కక్షసాధింపు అంటూ ఆ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ దర్యాప్తు చట్టానికి లోబడి ఉన్నట్టే.. చిట్‌ఫండ్స్ కంపెనీ నిర్వహణలో రామోజీరావు సైతం చట్టానికి లోబడి ఉండాలన్నారు.

చిట్‌ఫండ్స్ చట్టం అమలు కాకుండా ఏకంగా 26 ఏళ్లు అడ్డుకున్నారు

మర్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను చిట్‌ఫండ్ యాక్ట్ 1982 మేరకు నడపడంలేదని అన్నారు. చిట్‌ఫండ్స్ సొమ్ముతో వేరే వ్యాపారం చేయకూడదన్నారు. చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారమే బ్యాలెన్స్ షీట్లు ఫైల్ చేయాల్సి ఉన్నా.. కంపెనీ యాక్ట్స్ ప్రకారం నడుచుకుంటున్నామని ఈ కేసులో ఏ-2 శైలజాకిరణ్ అవివేకంతో కూడిన సమాధానాలు చెప్పారని తెలిపారు. ఒక గ్రూప్ డబ్బు మరో గ్రూప్‌కు వాడొద్దని చట్టం చెబుతున్నా.. మార్గదర్శి బ్రాంచ్‌లన్నింటిలోని డబ్బు అక్రమంగా హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్టు అన్ని ఆధారాలు లభించాయని చెప్పారు. చిట్‌ఫండ్ యాక్ట్ రావడానికి ముందే మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ప్రారంభమైందన్న వింత వాదన తెస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 1982లో చిట్‌ఫండ్ యాక్ట్ పాస్ చేస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో పాస్ చేయాల్సి ఉందన్నారు. కానీ 26 ఏళ్ల తర్వాత 2008లో అమలు చేశారని, ఇన్నేళ్లూ రామోజీరావు పలుకుబడితో అడ్డుకున్నారని వివరించారు.

నిబంధనలున్నా.. వారికి అనుకూలంగా వాడారు


మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ లావాదేవీలు చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారం కాకుండా రామోజీరావు, శైలజా కిరణ్ వారికి అనుకూలంగా కంపెనీ యాక్ట్ ప్రకారం చూపుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. తమకు ఆ నిబంధనలు వర్తించవన్న తరహాలో సమాధానాలిచ్చారన్నారు. ఖాతాదారుల నుంచి సొమ్ము వసూలుకు మాత్రం చిట్‌ఫండ్స్ చట్టాన్నే వాడుకొంటున్నారని చెప్పారు. ఇదే తరహాలో చీరాలలో రూ.65 లక్షల డిఫాల్ట్ కేసులో ష్యూరిటీగా ఉన్న వ్యక్తి నుంచి రూ.6 కోట్లు విలువైన ఆస్తిని అటాచ్ చేయించారని తెలిపారు. ఇలాంటి ఎన్నో అంశాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయన్నారు. సంస్థలోని అంతర్గత లుకలుకలు బయటపడతాయనే చిట్‌ఫండ్స్ యాక్ట్‌ను అమలు చేయడంలేదన్నారు.

చిట్ సెటిల్‌మెంట్‌లోనూ నిబంధనలు పాటించడంలేదన్నారు. చిట్ ముగిసిన వారి వివరాలతో, కొన్నింటిలో మానేసిన ఖాతాదారుల పేర్లు వాడి మళ్లీ చిట్‌లు నడుపుతున్నారని, ఇలా ఎన్నో విస్తుపోయే ఆధారాలు లభించాయని తెలిపారు. చిట్ డబ్బు బ్రాంచ్‌లో లేకపోవడంపై ప్రశ్నిస్తే.. మీరెవరు ప్రశ్నించేందుకు అన్న రీతిలో సమాధానాలు ఇస్తున్నారన్నారు. చట్టానికి వారు సహకరించడం లేదని చెప్పారు.

తొక్కతీస్తా.. నార తీస్తా.. ఏమిటీ భాష?

ఎమ్మెల్యే ద్వారంపూడిని దూషించేందుకు మీ సమయాన్ని వృథా చేయొద్దు

జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కాపునేత ముద్రగడ లేఖ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఒకపక్క టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేస్తానంటూ మరోపక్క తనను ముఖ్యమంత్రిని చేయాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వ్యాఖ్యానించారు. కలసి పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయమని ఎలా అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. పవన్ 175 స్థానాల్లో పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయాలని కోరడం తప్పు కాదన్నారు. ఓ పార్టీని స్థాపించాక పదిమంది ప్రేమను పొందాలేగానీ వీధి రౌడీ భాషలో మాట్లాడటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు పవన్‌ను ఉద్దేశించి రాసిన లేఖను ముద్రగడ మంగళవారం మీడియాకు విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న తీరు, ప్రజా ప్రతినిధులపై ఉపయోగిస్తున్న పరుష పదజాలాన్ని లేఖలో ముద్రగడ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఈ లేఖ రాసినందుకు మీకు ఎక్కడా లేని కోపం రావచ్చు. మీ కోట్లాది మంది అభిమానులు నన్ను తుదిముట్టించే ప్రయత్నం చేయవచ్చు. అయినప్పటికీ నిజాన్ని నిర్భయంగా రాయక తప్పడం లేదు' అని అందులో పేర్కొన్నారు.

రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు

కులాన్ని అడ్డం పెట్టుకుని నేను నాయకుడిగా ఎదగలేదు. కులాన్ని అడ్డు పెట్టుకుని ఎప్పుడూ ఏ పదవీ పొందలేదు. యువతను వాడుకుని భావోద్వేగాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగ్గంపేట సభలో రిజర్వేషన్ల అంశం తన చేతిలో ఉండదని, అది కేంద్రం పరిధిలో ఉందని అన్నప్పుడు నేను ఇచ్చిన సమాధానం ఏమిటో పవన్ ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. పిల్లి సుభాష్ చంద్రబోస్, బొత్స సత్యన్నారాయణలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయమని కోరా. నేను కోట్లాది రూపాయల కోసం, సూట్‌కేసులకు అమ్ముడు పోవడానికి ఉద్యమం చేయలేదు. నాకంటే చాలా బలవంతుడైన పవన్ నేను వదిలేసిన ఉద్యమాన్ని చేపట్టి కాపు యువతకు రిజర్వేషన్ ఫలాలను ఎందుకు సాధించలేదో చెప్పాలి. పవన్‌కు రాజకీయ సలహాలు ఎవరిస్తున్నారో నాకు తెలియదు. ఆయన మాట్లాడే భాష వల్ల నష్టమేగానీ లాభం ఏమాత్రం ఉండదు. 'తొక్క తీస్తా.. నార తీస్తా.. కింద కూర్చోబెడతా.. చెప్పుతో కొడతా.. గుండు గీయిస్తా..!' లాంటి వ్యాఖ్యలు పదేపదే చేస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమందిని అలా చేశారో ఆయనే చెప్పాలి. పవన్ గతంలో నావద్దకు రాయబారులను పంపిస్తే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విశాఖ ఉక్కు, కడప స్టీల్ ప్లాంట్ తదితర సమస్యలపై పోరాడాలని సూచించా. పవన్‌కు నిజంగా రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఈ సమస్యలపై యుద్ధం చేయాలి. అంతేకానీ నాలాంటి అనాథలపై కాదు.

ముడుమాల్ నిలువురాళ్లపై అధ్యయనం

- డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో రాష్ట్ర వారసత్వ శాఖ ఒప్పందం
- వారసత్వ హోదాకు యునెస్కోకు దరఖాస్తు
- నేటి నుంచి అధ్యయనం షురూ

సాక్షి, హైదరాబాద్: దాదాపు నాలుగు వేల ఏళ్ల క్రితం ఆది మానవులు ఏర్పాటు చేసిన నిలువురాళ్ల(మెన్హిర్స్)పై అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం జరగబోతోంది. నారాయణపేట జిల్లాలోని ముడుమాల్‌లో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో వేల సంఖ్యలో నిలువు రాళ్లు ఉన్నాయి. ఇందులో కొన్ని 20 అడుగుల ఎత్తుతో ఉన్నాయి. పొడవాటి పెద్ద శిలలు దాదాపు 80 వరకు ఉండగా, చిన్నవి మూడు వేల వరకు ఉన్నాయి. ఇవి క్రీ.పూ.2 వేల ఏళ్ల కంటే పాతవని చరిత్ర పరిశోధకులు అభిప్రాయం. యునెస్కో గుర్తింపు పొందిన లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో ముడుమాల్ నిలువు రాళ్లకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఇంతకాలం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతూ వచ్చింది. ఇన్నేళ్లకు వాటి ప్రత్యేకతలపై ఆధునిక పద్ధతిలో అధ్యయనం, డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు. చాలా రాళ్లు ఒంగిపోగా, కొన్ని కూలిపోయాయి. గతంలో అవి ఎలా ఉండేవో గుర్తించి వాటిని సరిచేసి ఆ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా గుర్తించి పరిరక్షించేందుకు ఎట్టకేలకు తెలంగాణ వారసత్వ శాఖ సిద్ధమైంది. ఆ మేరకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో ఆ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. కొద్ది రోజుల క్రితమే ఆ ఒప్పందం జరగ్గా, మంగళవారం అందుకు సంబంధించిన పత్రాలను మంత్రి శ్రీనివాసగౌడ్ అందజేశారు.



ఒప్పందం పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసగౌడ్

ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్

ట్రస్టు చైర్మన్ వేదకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.పుల్లారావు, , ఏఎస్ఐ విశ్రాంత అధికారులు బాబ్జీరావు, తాహెర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ హరగోపాల్, మొయినాబాద్‌లోని జేబీఆర్ ఆర్కిటెక్ట్ కాలేజీ స్కాలర్లు తదితరులు ఈ ప్రాంతంపై ఏడాది కాలంపాటు అధ్యయనం, ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు.



నక్షత్రాల వరుసను పోలిన...

ఆదిమానవుల కాలంలో మృతి చెందిన ప్రముఖుల సమాధి వద్ద నిలువురాళ్లకు స్మారకంగా పాతడం ఆనవాయితీ. వాటని మెన్హిర్స్ అంటారు. ముడుమాల్‌లోని నిలువురాళ్లు కూడా అలాంటి స్మారక శిలలే. అయితే వాటిని ఒకేచోట ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయటం ద్వారా అప్పట్లో ఖగోళ పరిశోధనశాలగా వినియోగించారని పరిశోధకులు గతంలో గుర్తించారు. సూర్యుడు గమనం వల్ల ఆ రాళ్ల నీడల్లో వచ్చే మార్పుల ఆధారంగా వాతావరణాన్ని అంచనా వేసేవారని, అక్కడి ఓ రాతిపై సప్తర్షి మండలం (ఉర్సా మేజర్)గా పేర్కొనే నక్షత్రాల వరసను పోలి ఉండటాన్ని గతంలో పరిశోధకులు గుర్తించారు. లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్ వద్దకూడా అలాంటి ఏర్పాటే ఉండటం విశేషం. ఇప్పుడు లోతైన అధ్యయనం ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోనున్నారు. ఈమేరకు మంగళవారమే వేదకుమార్, కేపీఆర్ తదితరులు పరిశోధనల కోసం ముడుమాల్ వెళ్లారు.

నేడు అతి తాపపు రోజు కావడంతో

జూన్ 21 వేసవి అతి తాపపు రోజు. ఆ రోజు సూర్యుడి గమనంలో మార్పు వస్తుంది. ఇది పరిశోధనలకు మరింత అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో వెంటనే పని ప్రారంభించినట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో దీని ప్రత్యేకతలు మరిన్ని వెలుగులోకి వస్తే, దాని ఆధారంగా ఈ ప్రాంతాన్ని ప్రపంచ వారసత్వ హోదా గుర్తింపు కోసం యునెస్కోకు దరఖాస్తు చేయనున్నారు.

కాలుష్యంపై పోరుబాట



భిక్కనూరు ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ ముందు ధర్నా చేస్తున్న ప్రజలు

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రం సమీపంలోని ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మంగళవారం కాచాపూర్, అయ్యవారిపల్లి, మాందాపూర్, సంగమేశ్వర్ అంతంపల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ముట్టడించారు. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లుతున్న వ్యర్థాలు, విష వాయువులను నివారించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 57వ రోజుకు చేరుకున్నాయి. యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోడంతో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి, ఐదు గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ ముట్టడికి బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దమల్లారెడ్డి గ్రామశివారులోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద వారిని అడ్డుకున్నారు. కామారెడ్డి డీఎస్పీ సురేశ్ ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డిని వెంటబెట్టుకుని వచ్చారు. వీడీసీ అధ్యక్షుడు మైపాల్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ వల్ల వాతావరణంతో పాటు నీరు కలుషితమవుతోందని, ప్రజల ఆరోగ్యం చెడిపోతోందని తెలిపారు. ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తామని ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఐదు గ్రామాల నుంచి మొత్తం ఐదుగురిని కమిటీలోకి తీసుకుంటామని, డీఎస్పీతో పాటు ఫ్యాక్టరీ సిబ్బంది ఐదుగురు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తామనడంతో ధర్నాను విరమించారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో తగ్గిన నీటిమట్టం




కిన్నెరసాని రిజర్వాయర్‌లో తగ్గిన నీరు

పాల్వంచరూరల్: భానుడి భగభగతో జనం ఇబ్బంది పడుతుండగా.. కిన్నెరసాని జలాశయంలోని నీటిమట్టం కూడా తగ్గింది. జలాశయం నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, నిత్యం 90క్యూసెక్కుల నీటిని కేటీపీఎస్, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో ప్రజల తాగునీటి అవసరాలకు వదులుతున్నారు. దీనికి తోడు ఎండల కారణంగా మంగళవారం రిజర్వాయర్‌లో నీటిమట్టం 398.30 అడుగులకు చేరింది. కాగా, గతేడాది ఇదేరోజున 397 అడుగులు గా ఉందని అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే నీరు ఎక్కువగానే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నా.. మరికొన్ని రోజులు వర్షాలు పడకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని తెలుస్తోంది.

'నవోదయ'లో ఆరో తరగతి ప్రవేశాలు

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 10లోగా www.navodaya.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వచ్చే ఏడాది జనవరి 20న పరీక్ష నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదోతరగతి చదివి, 01-05-2012 నుంచి 31-07-2014 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో తల్లిదండ్రుల నివాస ధ్రువీకరణపత్రం ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆలయాల్లో కొత్త కాంతులు



పునర్నిర్మాణ నిధులతో రూపుదిద్దుకున్న పాల్వంచలోని శ్రీరామాలయ భజనమందిరం

- ధూప దీప నివేదన.. నిత్యపూజలతో శోభ
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా అభివృద్ధి
- సర్వశ్రేయ నిధుల ద్వారా పలుచోట్ల ఆలయాల పునర్నిర్మాణం

నేడు 'ఆధ్యాత్మిక దినోత్సవం'

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ ఏర్పడ్డాక పలు ఆలయాలకు కొత్తకళ సంతరించుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన అనేక దేవాలయాలు నేడు భక్తుల ఆరాధనలతో పునరుజ్జీవం పొందాయి. శిథిలావస్థలో ఉన్న పురాతన ఆలయాలు పునర్ వైభవాన్ని సంతరించుకోగా, ధూప, దీప, నైవేద్య పథకంతో నిత్య పూజలు జరుగుతున్నాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డీడీఎన్‌తో నిత్యపూజలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు ఆలయాలు నిర్లక్ష్యానికి గురవుతూ శిథిలావస్థకు చేరుతున్న క్రమాన ధూప దీప నివేదన పథకం ఆదుకుంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే ఈ పథకం ప్రారంభించగా.. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 115 దేవాలయాలను ఎంపిక చేశారు. అంతేకాక అర్చకులకు రూ.2,500 గౌరవ వేతనం అందేది. తెలంగాణ ఏర్పడ్డాక మరో 123 ఆలయాలను ఈ జాబితాలో చేర్చి మొత్తం 238 దేవాలయాల్లో పథకాన్ని అమలు చేస్తూ గౌరవ వేతనాన్ని రూ.6 వేలకు పెంచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాడు 18 దేవాలయాలకు అమలైన ధూపదీప నివేదన పథకం ఇప్పుడు 63 దేవాలయాలకు విస్తరించింది. తాజాగా ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో మరో 67 ఆలయాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 35 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక అర్చకుల వేతనం, ధూప దీప నివేదన పథకం అమలుకు ఒక్కో ఆలయానికి రూ.10 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో హర్షం వ్యక్తమవుతోంది.

సర్వశ్రేయ నిధుల ద్వారా పునర్నిర్మాణం

తెలంగాణ ఏర్పడ్డాక ఆలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చేలా పునర్‌నిర్మించేందుకు సర్వశ్రేయ నిధి పేరుతో నిధులను మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాలో 40 దేవాలయాలను రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లతో అభివృద్ధి చేసింది. ఇటీవల ఖమ్మం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిగొండ మండలం ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జ్ఞాన మందిరం నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేశారు. అలాగే, దాతల పథకం ద్వారా రూ.4.29 కోట్లు, బలహీన వర్గాలు ఉండే ప్రాంతాల్లో ఏడు దేవాలయాలను రూ.84 లక్షలతో అభివృద్ధి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సర్వశ్రేయ పథకం కింద రూ.7.33 కోట్లతో 13 దేవాలయాలను అభివృద్ధి చేయగా.. సీజీఎఫ్ నిధులు రూ.5.10 కోట్లతో ఆరు దేవాలయాలు, దాతల విరాళాలు రూ.1.87 కోట్లతో నాలుగు ఆలయాల పునర్నిర్మాణం చేపట్టారు. అంతేకాక బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో ఉన్న మూడు దేవాలయాలను రూ.36 లక్షలతో అభివృద్ధి చేశారు.

ఆధ్యాత్మిక దినోత్సవానికి ఏర్పాట్లు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 420 దేవాలయాల్లో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల వైభవాన్ని చాటేలా.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వైష్ణవాలయాల్లో సుదర్శన హోమాలు, శివాలయాల్లో మహా రుద్రాభిషేకంతో పాటు వేద పారాయణం, చండీహోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఖమ్మం శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర, వాసవీ గార్డెన్స్‌లో శ్రీనివాస కల్యాణం జరపనున్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్తమ సేవలందించిన దేవాదాయ శాఖ ఉద్యోగులు ముగ్గురికి ప్రశంసాపత్రాలు అందిస్తారు. ఇవేగాక నూతనంగా ధూప దీప నివేదన పథకానికి ఎంపికైన దేవాలయాల బాధ్యులకు ఉత్తర్వులు అందజేస్తారు.

పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలి..



తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించనున్నాం. అన్ని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపిస్తాం. భక్తులు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలి.

–ఎ.సులోచన, ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ

అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథుడి రథాన్ని లాగుతున్న భక్తులు

గౌతమీనగర్ కాలనీలో ఒడిశా ఉద్యోగుల ఆధ్వర్యాన నిర్వహణ

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలిచే అశ్వాపురంలోని భారజల కర్మాగారం ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించగా మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే ప్రారంభించారు. ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగే జగన్నాథ రథయాత్రను తలపిస్తూ గత 23 ఏళ్లుగా భారజల కర్మాగారంలో విధులు నిర్వర్తించే ఒడిశా రాష్ట్ర అధికారులు, ఉద్యోగులతో ఏర్పడిన ఉత్కల్ పతాగర్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి దేవతామూర్తులకు తొలిరోజు ఆధ్యాపూజ, మధ్యాహ్న పూజ, పహాండి, ఛెరపహారా నిర్వహించారు.

కోలాహలంగా రథయాత్ర

జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ప్రతిష్ఠించి గౌతమీనగర్ కాలనీ పురవీధుల్లో మేళతాలాలు, కోలాటాలు, నృత్యాల నడుమ ఊరేగించారు.



రథయాత్రలో జీఎం థాలే, తదితరులు

ఆతర్వాత ఉత్కల్ పతాగర్ మండపం ఎదుట రథం వద్దకు చేర్చి పూజలు చేశారు. తొలుత రథయాత్రను ప్రారంభించిన భారజల కర్మాగారం జీఎం కే.వీ.థాలే ఛెరపహారా(చీపురుతో రథం శుభ్రం చేయు ట) నిర్వహించారు. అనంతరం ఒడిశా వాసులతో పాటు వివిధ రాష్ట్రాల ఉద్యోగులు ఇరువైపులా బారులుదీరి రథాన్ని లాగారు. కాగా, తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలు ఈనెల 28న బాహుడా యాత్రతో ముగియనున్నాయి. భారజల కర్మాగారం అధికారులు, ఉత్కల్ పతాగర్ కమిటీ అధ్యక్షుడు అర్.ఫాణిగ్రహి, కమిటీ సభ్యులు బలరాంసాహు, సరోజ్‌దాసు, మదన్‌మోహన్‌సాహు, ఉద్యోగులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భద్రాచలం వాసికి హరితోత్సవ పురస్కారం

భద్రాచలంఅర్బన్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో భద్రాచలంవాసికి పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన సమావేశంలో భద్రాచలానికి చెందిన గోళ్ల భూపతిరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హరితోత్సవ పురస్కారాన్ని అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకిరణ్‌రెడ్డి అందజేశారు. ఏడాది కాలంలో మొక్కల సంరక్షణకు చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని,



మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భూపతిరావు

తన పేరు ప్రతిపాదించిన భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక కార్యాచరణతో మెరుగైన ఫలితాలు

బూర్గంపాడు: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ఐటీడీఏ ఏపీఓ (జనరల్), ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. మండలంలోని ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, విద్యార్థులు సైతం ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలని



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ డేవిడ్‌రాజ్

చెప్పారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, నైట్‌డ్రెస్‌లను ఏపీఓ అందజేశారు. కార్యక్రమంలో పీఎంఆర్సీ ఏసీఎంఓ రమణయ్య, హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే రూ.లక్ష పథకం

- అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చెబితేనే లబ్ధి
- ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: వెనుకబడిన వర్గాల కోసం ప్రకటించినట్లు చెబుతున్న రూ.లక్ష ఆర్థిక సాయం పథకం బీఆర్ఎస్ కార్యకర్తల కోసమేనని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఈ పథకం ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి పైరవీలు లేని అత్యధికులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందలేదని, పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. ఇక మీ సేవలో చేసిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయ బాక్సుల్లో వేస్తే తెరిచే వారే కానరావడం లేదని చెప్పారు. మరోవైపు విద్యార్థుల సర్టిఫికెట్లను పక్కకు పెట్టి ఈ దరఖాస్తుల పరిశీలనపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని ధ్వజమెత్తారు. దీనికి తోడు రూ.లక్ష పథకం విషయంలో పైరవీలు ఊపందుకున్నాయని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన దరఖాస్తులను పరిష్కరించి మిగతా వారిని పెండింగ్‌లో పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ బీసీ కార్యకర్తలు చేజారకుండా ఉండేందుకే కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం రూ.లక్ష సాయం పథకాన్ని ప్రవేశపెట్టిందని పొంగులేటి ఆరోపించారు.